సాక్షి తిరుపతి

సోమవారం । 5 । ఆగస్టు । 2024



మాడ వీధుల తనిఖీ

టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి ఆదివారం తిరుమల మాడవీధులను తనిఖీ చేశారు. - 8లో



వైభవంగా కూష్మాండ పూజ

ఆదివారం అమావాస్య కావడంతో రాయలచెరువు కట్ట శ్రీశక్తిపీఠంలో కూష్మాండ పూజ నిర్వహించారు. - 8లో




మలిమేలుకండ్రిగ వద్ద ప్రమాదం

నాగలాపురం మలిమేలు కండ్రిగ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో 12 మంది రక్తగాయాల పాలయ్యారు. - 8లో



రేణిగుంట మండలం ఎస్ఎన్‌పురం పాఠశాలలో ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం తింటున్న విద్యార్థులు





గాజులమండ్యం పాఠశాలలో ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం తింటున్న విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలపై ప్రభుత్వ నిర్లక్ష్యం

సర్దుబాటుతో నెట్టుకొస్తున్న విద్యాశాఖ

టీచర్ల కొరతతో సాగని చదువులు

కొత్తగా చేరిన విద్యార్థులకు అందని యూనిఫాం

నాణ్యత లోపించిన మధ్యాహ్న భోజనం

చతికిల బడి

తిరుపతి ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా 1,817 ప్రాథమిక, 194 ప్రాథమికోన్నత, 323 ఉన్నత పాఠశాలలు, మొత్తం 2,334 పాఠశాలలున్నాయి. ఇందులో మొత్తం సర్కారు బడుల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు 1,37,731 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గతంలో ప్రభుత్వ బడులను చంద్రబాబునాయుడు పూర్తిగా నిర్వీర్యం చేశారు. బడుల్లో కనీస వసతులు కల్పించకపోవడంతో చాలా వరకు శిథిలావస్థకు చేరాయి. ఇలాంటి బడుల్లో చదవలేక చాలా మంది పేద పిల్లలు చదువుకు దూరమయ్యారు. బడులను బాగు చేయాల్సిన చంద్రబాబు సరిపడినంత మంది విద్యార్థులు లేరన్న సాకుతో 2014–19 మధ్యలో ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు వెయ్యికి పైగా బడులను మూసి వేశారు. పాఠశాలల పునఃప్రారంభానికి ఇవ్వాల్సిన ఉచిత పాఠ్య పుస్తకాలను ఏడాది చివరి వరకు విడతల వారీగా అందించేవారు. పేద పిల్లలకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యత లేకుండా నామమాత్రంగా అందించేవారు. తన వర్గంగా భావించిన నారాయణ , శ్రీచైతన్య వంటి విద్యాసంస్థలకు ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వ విద్యను గతంలో చంద్రబాబు సర్కారు అధోగతి పాల్జేసింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆనాటి తరహా విధానాలనే ప్రభుత్వ బడులపై కొనసాగిస్తోంది.

ప్రభుత్వ విద్యార్థులంటే చిన్నచూపు

ప్రభుత్వ పాఠశాలలన్నా.. అందులో చదివే విద్యార్థులన్నా మొదటి నుంచే చంద్రబాబుకు చిన్న చూపు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నన్నాళ్లు ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి ఎటువంటి చర్యలు తీసుకోకపోగా నిర్వీర్యం చేసేలా వ్యవహరించారన్న విమర్శలు ఉన్నాయి. అయితే 2019లో ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న వెంటనే విద్యాభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ బడులను బాగు చేసే పనిలో పడ్డారు. గడిచిన ఐదేళ్లల్లో విద్యా వ్యవస్థను బలోపేతం చేసి గాడిలో పెట్టారు. అనేక సంక్షేమ పథకాలతో ప్రభుత్వ విద్యారంగానికి పూర్వ వైభవం తీసుకొచ్చారు. అయితే ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తిరిగి పాత వైఖరినే అనుసరిస్తోంది. ప్రభుత్వ విద్యారంగాన్ని బలహీన పరిచి పేద విద్యార్థులను చదువుకు దూరం చేస్తూ పరోక్షంగా ప్రైవేటు, కార్పొరేట్‌కు ధారాదత్తం చేసేందుకు ప్రణాళికలు రచిస్తోందంటూ బాహాటంగానే విమర్శలు వస్తున్నాయి.

వైఎస్ఆర్ సీపీ పాలనలో బడులకు మహర్దశ

జిల్లా వ్యాప్తంగా 2019–2024 వరకు వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ పాఠశాలలకు కొత్త వైభవం వచ్చింది. పేద పిల్లలు అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడాలన్న ఆకాంక్షతో అనేక సంస్కరణలను అమలు చేసింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి రూ.2,641 కోట్లకుపైగా ఖర్చు చేసింది. ఎప్పటికప్పుడు ఖాళీ టీచర్ల పోస్టులను సర్దుబాటు చేస్తూ వచ్చింది. బడులు తెరిచిన మొదటి రోజే విద్యార్థులకు విద్యాకానుక కిట్లను అందజేసింది. ప్రతి ఏడాది జూన్‌లో అమ్మఒడి సహాయం నేరుగా తల్లుల ఖాతాల్లో జమ చేసింది. అనేక సంక్షేమ పథకాలతో 2019కి ముందు హీనంగా మారిన ప్రభుత్వ బడులు తల్లిదండ్రుల నుంచి విశ్వాసం పొందడంతో మహర్దశ కలిగింది. తద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో గణనీయంగా విద్యార్థుల సంఖ్య పెరిగింది.

వేధిస్తున్న టీచర్ల కొరత

జిల్లా వ్యాప్తంగా ఉన్న సర్కారు బడుల్లో టీచర్ల కొరత వేధిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో రెగ్యులర్ ఉపాధ్యాయుల పోస్టులు 7,651 ఉండగా వాటిలో సుమారు 6,846 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. 803 టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో గణితం, బయాలజీ, సోషియల్, ఇంగ్లిష్, తెలుగు, హిందీ, ఉర్దూ, తమిళం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అధికంగా ఎస్జీటీ కేడర్‌లో 471 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అధికంగా ఎస్జీటీ టీచర్ల కొరత ఉండడంతో ప్రాథమిక విద్య మిథ్యగా మారింది.

విద్యావేత్తల మండిపాటు

పాఠశాలలు తెరిచి రెండు నెలలు పూర్తి కావస్తోంది. గత ఏడాది జూలై నెలలో అప్పటి ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఖాళీ పోస్టులను సర్దుబాటు చేసింది. దీంతో బోధనకు ఆటంకం లేకుండా విద్యార్థులకు చక్కగా చదువు అందింది. అయితే కూటమి ప్రభుత్వం ఖాళీలను భర్తీ చేయకపోగా కనీసం ఖాళీ పోస్టులను సర్దుబాటు చేసే ప్రక్రియ చేపట్టకపోవడంపై విద్యావేత్తలు మండిపడుతున్నారు.



వరదయ్యపాళెం మండలం చిన్న పాండూరులోని ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాల

జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల వివరాలు

యాజమాన్యం	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య	టీచర్ల సంఖ్య
ఏపీ మోడల్ స్కూల్స్	05	1850	88
ఏపీఆర్ఈఐ సొసైటీ స్కూల్స్	04	995	58
ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ సొసైటీ స్కూల్స్	10	2762	166
ఏపీటీడబ్ల్యూఆర్ఈఐ సొసైటీ స్కూల్స్	14	2600	141
బీసీ వెల్ఫేర్ స్కూల్స్	5	1181	58
ప్రభుత్వ టీడబ్ల్యూ ప్రాథమిక పాఠశాలలు	21	599	23
కేజీబీవీ పాఠశాలలు	5	1338	62
మినీ గురుకులం	1	92	7
ఎంపీపీ, జెడ్పీ స్కూల్స్	2130	109653	6706
మున్సిపల్ స్కూల్స్	92	10569	485
ప్రైవేట్ ఎయిడెడ్ స్కూల్స్	25	3491	62
రాష్ట్ర ప్రభుత్వ స్కూల్స్	18	3723	207
మొత్తం	2330	137737	8063

లోపించిన నాణ్యత

జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ బడుల్లో గత వైఎస్ఆర్‌సీపీ సర్కారులో అమలు చేసిన గోరుముద్ద మెనూనే ప్రస్తుతం కొనసాగిస్తున్నారు. మెనూలో ఇప్పటివరకు ఎలాంటి మార్పులు చేర్పులు చోటుచేసుకోలేదు. అయితే ఇదివరకులా కాకుండా నాణ్యత, రుచి తగ్గింది. కూరగాయలు, పప్పును తగ్గించడంతో రుచి తగ్గిందంటూ చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి రోజు ఒక్కో రకమైన రుచికర, బలవర్ధక ఆహారాన్ని చిన్నారులకు అందించారు. వారంలో 5రోజులు గుడ్డు, మూడు రోజులు చిక్కీ, మూడు రోజులు రాగి జావను అందించారు. దీంతో చిన్నారులకు అవసరమైన పోషకాలు అందుతూ రోగ నిరోధక శక్తి రెట్టింపు అయ్యి చలాకీగా ఉంటున్నట్లు అప్పట్లో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. అయితే ప్రస్తుతం అందుకు భిన్నంగా ఉందంటూ వాపోతున్నారు.

గతంలో జగనన్న గోరుముద్ద మెనూ

- సోమవారం : పొంగల్, ఉడికించిన గుడ్డు / వెజ్ పులావ్, ఎగ్ కర్రీతో పాటు చిక్కీ
- మంగళవారం: చింతపులుసు పులిహోర, దొండకాయ చట్నీ, ఉడికించిన గుడ్డు, రాగి జావ
- బుధవారం: వెజిటబుల్ రైస్, ఆలు కుర్మా, ఉడికించిన గుడ్డుతో పాటు చిక్కీ
- గురువారం: సాంబార్ బాత్/టమాట చట్నీతో టొమోటా రైస్, ఉడికించిన గుడ్డు, రాగి జావ
- శుక్రవారం : అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డుతో పాటు చిక్కీ
- శనివారం : ఆకుకూర వెజ్ రైస్ (పాలకూర, కొత్తిమీర

అరాకొరగానే స్టూడెంట్స్ కిట్లు

గత వైఎస్ఆర్ సీపీ సర్కారు బడులు తెరిచే నాటికే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేయాలనే ఉద్దేశంతో ముందస్తు కసరత్తు నిర్వహించి కిట్లు సరఫరా చేసింది. వాటిని కూటమి సర్కారు అధికారంలోకి రాగానే విద్యార్థులకు అందజేసింది. ఇంటర్మీడియట్ విద్యార్థులకు రెండు రోజుల క్రితం పాఠ్య పుస్తకాలను సరఫరా చేశారు. జిల్లాలో ఒకటో తరగతి నుంచి పదవ తరగతి వరకు స్టూడెంట్ కిట్లను అందజేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లోని విద్యార్థులు 1,37,731మందికి కిట్లను అందజేశారు. ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ ఇంకా ఇవ్వాల్సి ఉంది. పలు చోట్ల పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అరకొరగా అందజేశారు. ఇంటర్మీడియట్ ఒకేషనల్ విద్యార్థులకు ఇంత వరకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయలేదు. జిల్లాలో దాదాపు 4 వేల విద్యార్థులకు బూట్లు అందలేదు.

పుస్తకాలు అరకొరగా ఇచ్చారు



పాఠ్య, నోటు, వర్క్‌బుక్కులు అరకొరగా అందడంతో చదువుకునేందుకు కష్టంగా ఉంది. వీటితో పాటు డిక్షనరీ ఇంకా ఇవ్వనలేదు. డిక్షనరీ ఇచ్చి ఉంటే ఇంగ్లిష్ సబ్జెక్టులో తెలియని పదాలను తెలుసుకోవడానికి ఉపయోగపడి ఉండేది. బయట కొనుక్కుందామంటే డబ్బులెక్కువ. అంత ఖర్చుపెట్టి మా తల్లిదండ్రులు కొనివ్వలేరు. ఏం చెయ్యాలో అర్థం కావడం లేదు. మా సార్లను అడగాలంటే భయంగా ఉంది. త్వరగా ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ పంపిణీ చేయాలి.

– నందిని, పదో తరగతి విద్యార్థిని, బందారుపల్లి, శ్రీకాళహస్తి మండలం

రుచి ఉండడం లేదు



మధ్యాహ్న భోజనం రుచి తక్కువగా ఉంది. సాంబార్ సరిగ్గా ఉండడం లేదు. నేను ఒక్కొక్క సారి ఇంటి నుంచే క్యారీ తెచ్చుకుంటాను. నేను నాలుగో తరగతి చదివేటప్పుడు మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనం పెట్టేవారు. అప్పట్లో స్కూల్లోనే తినాలనిపించేది. ఇప్పుడెందుకో ఇలా అర్థమవ్వడం లేదు.

– శ్రీచందన, 5వ తరగతి విద్యార్థిని, తిరుపతి

మెనూ ప్రకారం ఇవ్వాలి



మా పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. తాపీ పనులు, ఆటో నడుపుతూ వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటూ పిల్లలను చదివిస్తున్నాను. మేము ఇంట్లో కూడా ఇంతలా పిల్లలకు మంచి భోజనం పెట్టేవాళ్లం కాదు. అలాంటిది ఇదివరకు స్కూల్లో మంచి భోజనం పెట్టారు. ప్రతి రోజు గుడ్డు, చిక్కీ, రాగి జావ మా పిల్లలు ఆహారంగా తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉన్నారు. ఇప్పుడు కూడా అలాంటి ఆహారాన్నే మెనూ ప్రకారం అందించాలి.

– గిరి, విద్యార్థి తండ్రి, తిరుపతి

నిర్వీర్యం చేయడం తగదు



గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రభుత్వ విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యమైంది. గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసింది. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తిరిగి ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేయడాన్ని మానుకోవాలి.

– కె.శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏఐఎస్ఎఫ్

పౌష్టికాహారం అందించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే ప్రతి విద్యార్థికి పౌష్టికాహారం అందించాలి. గత ప్రభుత్వం గోరుముద్ద పేరుతో రుచి, శుచితో కూడిన బలవర్ధక పదార్థాలను అందించింది. మెనూ రూపొందించి ఆరు రోజులు రోజుకో ఆహారాన్ని అందిస్తూ విద్యార్థులకు నాణ్యమైన చదువుతోపాటు పౌష్టికాహారాన్ని అందించింది. అదే విధంగా విద్యార్థులకు పౌష్టికాహారం అందిచాలి.

– పూజారి రాఘవేంద్ర, జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఏబీవీపీ

పేరు మారింది.. నాణ్యత పోయింది



రేణిగుంట బాలుర పాఠశాలలో భోజన పాత్రలు దించుతున్న విద్యార్థులు

అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తోంది. ప్రస్తుత కూటమి సర్కారు జగనన్న గోరుముద్ద పేరును తొలగించి అన్ని పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం అనే పేరును బోర్డుల్లో రాయిస్తుస్తోంది. పథకం పేరు మార్చడంలో ఉన్న శ్రద్ధ అములులో లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా సర్కారు బడుల్లో 1,37,731 మంది విద్యార్థులకు గాను 1,32,221 మంది భోజనం తింటున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. మిగిలిన 5,510 మంది విద్యార్థులు భోజనం బడుల్లో తినడం లేదు. ఇందులో ఎక్కువగా ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న 3,863 మంది మధ్యాహ్న భోజనం తినడం లేదని అధికారిక నివేదికలు వెల్లడిస్తున్నాయి. అలాగే విద్యార్థులకు అందించే కోడి గుడ్లు, చిక్కీలను ఆలస్యంగా అందుతున్నట్లు సమాచారం.



నాగలాపురం పాఠశాలలో ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం తింటున్న చిన్నారులు

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 11 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 75,140 మంది స్వామిని దర్శించుకున్నారు. 28,256 మంది తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.76 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 10 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

కలెక్టరేట్‌లో నేడు గ్రీవెన్స్

తిరుపతి అర్బన్: తిరుపతి కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్) నిర్వహించనున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు వారి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశతో ప్రతి సోమవారం వస్తుంటారు. అయితే కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సందర్భంగా పోలీసుల తనిఖీలను ముమ్మరంగా చేపడుతున్నారు. సామాన్య ప్రజలు జిల్లా అధికారుల వరకు వెళ్లి వారి సమస్యలను తెలియజేయాలంటే గగనమవుతోందని పలువురు వాపోతున్నారు. మూడు దశలుగా పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. తనిఖీలతోపాటు ఏ సమస్యపై వస్తున్నావు... ఏ ఊరు నీది...అంటూ పలు ప్రశ్నలు వేస్తున్నారు.ఆ తర్వాత గ్రీవెన్స్ హాల్ ముందు భాగంగా కూర్చోబెట్టేస్తున్నారు. అంతే అక్కడ నుంచి లోనికి వెళ్లడానికి ఇక గంటల కొద్ది వేచి ఉండాల్సిందేనని పలువురు ఆవేదన చెందుతున్నారు. అయితే సిఫారసు ఉండేవారు మాత్రం నేరుగా వెళ్లి అధికారులను కలుస్తున్నారని చెబుతున్నారు. గ్రీవెన్స్ కార్యక్రమాన్ని పేదలు, సామాన్య ప్రజల సమస్యలను స్వీకరించి వాటికి పరిష్కార మార్గం చూపడం కోసం ఏర్పాటు చేస్తే... ఇలా భద్రత పేరుతో కట్టుదిట్టం చేయడాన్ని పలువురు తప్పుబడుతున్నారు. గతంలో స్పందన ఉండే సమయంలో కలెక్టరేట్‌లో నేరుగా అధికారులను కలసి తమ సమస్యను చెప్పుకునేవాళ్లమంటూ పలువురు వెల్లడిస్తున్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ అందుబాటులో ఉండకపోవడంతో జేసీ గ్రీవెన్స్ నిర్వహించనున్నారు.



అధికారులను కలవడానికి ఎదురుచూస్తున్న సామాన్య ప్రజలు(ఫైల్)

సౌకర్యాల లేమి

తాగునీటి సౌకర్యం కల్పించాల్సి ఉంది. అర్జీలను రాయడానికి అవసరమైన మేరకు వీఆర్‌వోలను ఏర్పాటు చేయాలని సామాన్య ప్రజలు కోరుతున్నారు. సోమవారం ఏ మాత్రం గ్రీవెన్స్‌లో సౌకర్యాలు కల్పిస్తారో చూడాల్సి ఉంది.

క్లుప్తంగా

శ్రీవారి ఆలయ నాలుగు మాడ వీధుల తనిఖీ


తనిఖీలు చేస్తున్న అదనపు ఈవో వెంకయ్యచౌదరి

తిరుమల: తిరుమలలోని శ్రీవారి ఆలయ నాలుగు మాడ వీధుల్లోని గ్యాలరీలను ఆదివారం టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. అక్టోబర్ 4 నుంచి 12 వరకు శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో నాలుగు మాడ వీధుల్లో ఉన్న ప్రవేశం, నిష్క్రమణ, హారతి పాయింట్ల గురించి తెలుసుకోవడానికి అన్ని గ్యాలరీలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహన మండపం నుంచి ప్రారంభమై నాలుగు మాడ వీధుల్లోని గ్యాలరీలు, తిరుమల నంబి ఆలయం వద్ద కదిలే వంతెన, గ్యాలరీల్లో ప్రవేశ, నిష్క్రమణ పాయింట్లు తదితర వివరాలను అధికారులు అదనపు ఈవోకు వివరించారు. ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, వీజీవో నందకిషోర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు పబ్లిక్ గ్రీవెన్స్

తిరుపతి తుడా : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం పబ్లిక్ గ్రీవెన్ రిడ్రెస్సల్ సిస్టమ్‌ను నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారు.

అడ్మిషన్లు అంతంత మాత్రమే..



- నేటితో ముగియనున్న ఇంజినీరింగ్ అడ్మిషన్లు
- జిల్లాలో సుమారు 4వేల సీట్లకు పైగా ఖాళీలు
- గత ఏడాది కంటే 15శాతం తగ్గిన అడ్మిషన్లు
- కొన్ని కోర్సుల వైపే మొగ్గు చూపిన విద్యార్థులు
- ప్రైవేటు కళాశాలల్లో పలు కోర్సుల్లో సింగిల్ డిజిట్ అడ్మిషన్లు

జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాలలు

ప్రభుత్వ కళాశాలలు	-	2
డీమ్డ్ వర్సిటీలు	-	2
అటానమస్ కళాశాలలు	-	5
ప్రైవేటు కళాశాలలు	-	11
మొత్తం సీట్ల సంఖ్య	-	34,355

తిరుపతి సిటీ : జిల్లాలో ఏపీ ఈఏఎమ్‌సెట్–2024 రెండో విడత ఇంజినీరింగ్ అడ్మిషన్ల కౌన్సెలింగ్ ప్రక్రియ శనివారంతో ముగియనుంది. ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఇప్పటికే సుమారు 90 శాతం అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయింది. ప్రభుత్వ, డీమ్డ్, అటానమస్ కళాశాలల్లో మాత్రం దాదాపు అన్ని కోర్సుల్లో అడ్మిషన్లు 80 శాతం పూర్తయ్యాయి. ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో సీఈసీ, ఈసీఈ, ఈఈఈ కోర్సులు మినహా మిగిలి కోర్సుల్లో సింగిల్ డిజిట్ అడ్మిషన్లకే పరిమితం కావడం గమనార్హం. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు అడ్మిషన్ల తీరుతెన్నులపై ఆందోళన చెందుతున్నట్లు సమాచారం. తిరుపతి జిల్లాలో ప్రభుత్వ, డీమ్డ్, అటానమస్, ప్రైవేటు కళాశాలల్లో ఈ ఏడాది పెంచిన సీట్లుతో కలిపి 34,355 సీట్లు ఉన్నాయి. ఇందులో తొలివిడతలో 23 వేల సీట్లు భర్తీ అయ్యాయి. రెండో విడత శనివారం అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయ్యే నాటికి 7,340 సీట్లు భర్తీ కావాల్సి ఉంది. మిగిలిన 4045 సీట్లు ప్రైవేటు కళాశాలల్లో ఖాళీగా ఉన్నట్లు సమాచారం.

గతం కంటే 15 శాతం తగ్గిన అడ్మిషన్లు

జిల్లాలో గతం కంటే సుమారు 15 శాతం ఇంజినీరింగ్ అడ్మిషన్లు తగ్గినట్టు తెలుస్తోంది. ప్రధానంగా విద్యార్థులు, తల్లిదండ్రులు పేరొందిన కళాశాలల వైపే మొగ్గు చూపుతూ ఆప్షన్లను ఎంపిక చేసుకున్నారు. కళాశాలలు, కోర్సుల ఎంపికలోనూ ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సులు, క్యాంపస్ డ్రైవ్‌లలో ఉద్యోగ అవకాశాల కల్పించే సంస్థల వైపు మొగ్గు చూపినట్లు మొదటి, రెండో విడత అడ్మిషన్ల సరళిని బట్టి స్పష్టమవుతోంది. జిల్లాలోని ఆరు ప్రైవేటు కళాశాలల్లో సివిల్, మెకానికల్, కెమికల్ ఇంజినీరింగ్ సీట్ల భర్తీ సింగిల్ డిజిట్‌గా ఉండడం చూస్తుంటే ఈ ఏడాది భారీ ఎత్తున సీట్లు ఖాళీగా ఉండనున్నాయి.

ఎస్వీయూలో సివిల్, కెమికల్‌కు డిమాండ్

జిల్లాలో పద్మావతి మహిళా వర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ తదితర ప్రభుత్వ కళాశాలల్లో మొదటి దశ అడ్మిషన్ల ప్రక్రియలో 80 శాతం వరకు సీట్లు భర్తీ అయ్యాయి. ఇందులో ప్రధానంగా ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా సివిల్, కెమికల్ ఇంజినీరింగ్ సీట్లకు భారీ ఎత్తున డిమాండ్ పెరిగింది. మొదటి దశ అడ్మిషన్ల ప్రక్రియలోనే దాదాపు 96శాతం సీట్లు భర్తీ కావడం విశేషం. వర్సిటీలో సీఈసీ, ఈఈఈ, ఈసీఈ, మెకానికల్, కెమికల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో 396 సీట్లకు గాను 236సీట్లు మొదటి దశలో భర్తీ అయ్యాయి. ప్రస్తుతం జరుగుతున్న రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియలో వందశాతం సీట్లు భర్తీ కానున్నట్లు అధికారులు వెల్లడించారు.

ముగిసిన ఇంజినీరింగ్ అడ్మిషన్ల ప్రక్రియ

తిరుపతి సిటీ: ఏపీ ఈఏఎంసెట్–2024 ఇంజినీరింగ్ అడ్మిషన్ల ప్రక్రియ శనివారంతో ముగిసింది. ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో అన్ని బ్రాంచ్‌లకు కలిపి 396 సీట్లు ఉండగా 366 సీట్లు భర్తీ అయ్యాయి. ఇందులో సివిల్, కెమికల్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లలో దాదాపు అన్ని సీట్లు భర్తీకాగా, సీఈసీ, ఈఈఈలో మాత్రం ఒక్కో బ్రాంచ్‌లో 66 సీట్లకు గాను 52 సీట్లు మాత్రమే భర్తీ కావడం విశేషం. మిగిలిన 30 సీట్లు వచ్చే ఏడాది ఈసెట్ ద్వారా డిప్లొమో విద్యార్థులకు లేటరల్ ఎంట్రీలో భాగంగా భర్తీ చేయనున్నారు. అలాగే తిరుపతి జిల్లాలో 20కి పైగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో 34,355సీట్లకు గాను 31,287 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. 3,068 సీట్లు మిగిలిపోయినట్లు సమాచారం. ఇందులో పేరొందిన వర్సిటీలు, డీమ్డ్, అటానమస్ కళాశాలల్లో దాదాపు పూర్తి స్థాయిలో సీట్లు భర్తీకాగా, కొన్ని ప్రైవేటు కళాశాలల్లో మాత్రం భారీ సంఖ్యలో సీట్లు మిగిలిపోయినట్లు తెలుస్తోంది. గత ఏడాది కంటే సుమారు 15 శాతం అడ్మిషన్లు తగ్గినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

ఆధ్యాత్మికం.. బతుకు సార్థకం


ప్రసంగిస్తున్న స్వామి శశికాంతానంద

తిరుపతి కల్చరల్ : ఆధ్యాత్మిక సాధనలో బతుకు సార్థకమవుతుందని రాజమహేంద్రవరం ఆశ్రమ స్వామి శశికాంతానంద తెలిపారు. ఆదివారం ఇస్కాన్ రోడ్డులోని శ్రీరామకృష్ణ ఆశ్రమ 9వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన భక్త సమ్మేళనంలో శశికాంతానంద ప్రసంగించారు. ఉత్తమ శిష్యుడు మోక్ష మార్గం పొందుతాడని, భగవంతుడు ఇచ్చిన పని పూర్తి చేసే వాడు ఆదర్శ భక్తుడవుతాడన్నారు. గురువు చెప్పినవి ఆచరించేవారు ఉత్తమ భక్తుడని వెల్లడించారు. అనంతరం ఆశ్రమ కార్యదర్శి స్వామి సుకృతానంద, ఆచార్య పీవీ రెడ్డి, పి.భాస్కరరావు మాట్లాడుతూ వివిధ ఆధ్యాత్మిక విషయాలపై ఉపన్యసించారు. ఈ క్రమంలోనే ఆశ్రమంలో ధ్యానం, విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. సాయంత్రం మాస్టర్ గోపి బృందం వారు భజనలు చేశారు. కార్యక్రమంలో స్వామి సత్వస్థానంద, జయచంద్రరెడ్డి, జీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

విరాళాల సేకరణ


ఏర్పేడులో విరాళాలు సేకరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఏర్పేడు: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితుల కోసం ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆమందూరు, ఏర్పేడులో విరాళాల సేకరణ చేపట్టారు. కొండచరియలు విరిగిపడి సర్వం కోల్పోయిన బాధితుల కోసం తమ వంతుగా విరాళాలు సేకరించి పంపనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తలారి బాలకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు కలపాటి గురవమ్మ, నాయకులు లక్ష్మణ్, వీరరాఘవయ్య, గురవయ్య, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో హుండీ చోరీ

పాకాల: గుర్తు తెలియని దుండగులు ఆలయంలో హుండీని చోరీ చేసిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఆదివారం స్థానికులు తెలిపిన వివరాల మేరకు దామలచెరువు రామాలయంలో గుర్తు తెలియని దుండగులు సీసీ కెమెరాలను పక్కకు పెట్టి, హుండీని పగలగొట్టి నగదును అపహరించారు. ఆదివారం ఉదయం గమనించిన స్థానికులు ఆలయంలో చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి



గూడూరు రూరల్: పట్టణ సమీపంలోని సౌత్ యార్డు ప్రాంతంలో ఓ వ్యక్తి ఆదివారం రైలు కింద పడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల మేరకు గూడూరు ఇందిరమ్మ కాలనీకి చెందిన షేక్ నాగూర్(46) అతని భార్య మధ్య చిన్న పాటి వివాదం నెలకొంది. దీంతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని భావిస్తున్నారు. రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని డ్యూటీ పాయింట్ ముజాఫర్ గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో రైల్వే హెడ్ కానిస్టేబుల్ పి.సురేష్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేశారు. అనంతరం మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

తిరుపతిలో కార్డన్ సెర్చ్

తిరుపతి క్రైమ్: అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిని శివజ్యోతినగర్‌లో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. తిరుపతి డీఎస్పీ రవి మనోహారాచారి ఆధ్వర్యంలో 45 మంది అధికారులు సిబ్బందితో కలిపి అయ్యప్ప కాలనీ శివజ్యోతినగర్‌లో కార్డన్ సెర్చ్ నిర్వహించగా ఇందులో ఎలాంటి పత్రాలు లేని నాలుగు ఆటోలు, 31 ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. సరైన పత్రాలు చూపించి వాహనాలను విడుదల చేసుకోవాలని, లేకుంటే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

కుక్కల దాడిలో జింక మృతి

చిత్తూరు కార్పొరేషన్: కుక్కల దాడిలో జింక మృతి చెందిన సంఘటన ఆదివారం నగరంలోని అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. ఎఫ్ఆర్ఓ థామస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక కార్తీకవనం నర్సరీ వెనుక వైపు ఉన్న అటవీ ప్రాంతం నుంచి నీటి కోసం ఓ జింక గంగినేని చెరువుకు వచ్చింది. ఆ ప్రాంతంలో ఉన్న కుక్కల గుంపు జింకను చూసి దాడి చేసి చంపేశాయి. సమాచారం అందుకున్న ఎఫ్ఆర్ఓ అక్కడికి వెళ్లి జింక కళేభరాన్ని పరిశీలించారు. సోమవారం జింక కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేస్తామని చెప్పారు.

నలుగురిపై కేసు నమోదు

ఏర్పేడు: మతమార్పిడి చేసుకోవాలని మండలంలోని మునగలపాలెంలో ఓ కుటుంబాన్ని బెదిరించిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు ఆదివారం తెలిపారు. మండలంలోని మునగలపాలెంకు చెందిన పెమ్మసాని వెంకటరమణ భార్య మాధురిని రేణిగుంటలోని శ్యామ్యూల్, రెడ్డిలక్ష్మి, నాగభూషణమ్మ, యశోద వారి ఇంటికి వెళ్లి తమ మతంలో చేరాలని బెదిరించారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

తిరుపతి క్రైమ్: తమిళనాడుకు చెందిన వ్యక్తి అప్పుల బాధ తాళలేక తిరుపతిలో ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం రాత్రి వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ రామస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తమిళనాడు కాంచీపురానికి చెందిన సంపత్ కుమార్(51) తిరుపతి తదితర ప్రాంతాల్లో సెకండ్ హ్యాండ్ ద్విచక్ర వాహనాలను విక్రయించేవాడు. ఇదే క్రమంలో తిరుపతికి తరచూ వచ్చి వెళ్లేవాడు. ఈ నెల రెండో తేదీన అలిపిరి పరిధిలోని ఓ లాడ్జిలో రూమ్ తీసుకున్నాడు. అయితే రెండు రోజులైనా బయటకు రాకపోవడంతో ఆదివారం ఉదయం హోటల్ యాజమాన్యం అలిపిరి పోలీసులకు సమాచారం అందించారు. తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా.. అప్పటికే గుర్తు తెలియని విషం తీసుకొని మృతి చెందినట్లుగా పోలీసులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతిపై బంధువులకు సమాచారం అందించారు. సంపత్‌కుమార్‌కు చాలా అప్పులున్నాయని, దీంతోనే మృతి చెంది ఉంటాడని తెలిపారు.

నేటితో ముగియనున్న డిగ్రీ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ

తిరుపతి సిటీ: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, టీటీడీ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఓఏఎండీసీ వెబ్‌సైట్ ద్వారా నిర్వహిస్తున్న వెబ్ ఆప్షన్ల ప్రక్రియ సోమవారం ముగియనుంది. 6వ తేదీన వెబ్ ఆప్షన్ల మార్పునకు అవకాశం ఉంటుందని తెలిపారు. 10వ తేదీన విద్యార్థులకు వివిధ కళాశాలల్లో సీట్లు కేటాయించనున్నట్లు అధికారులు వెల్లడించారు. విద్యార్థులు సీట్లు పొందిన కళాశాలల్లో 12వ తేదీ నుంచి అడ్మిషన్లు పొందాల్సి ఉంటుందని వివరించారు.

వైభవంగా కూష్మాండ పూజ


అమ్మవారికి కూష్మాండ పూజ చేస్తున్న వేద పండితులు

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువు కట్ట సమీపంలో ఉన్న శ్రీశక్తిపీఠంలో కొలువైన శ్రీ మరకత శక్తికాళీ దేవికి ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని వైభవంగా కూష్మాండ పూజ నిర్వహించారు. శ్రీశక్తిపీఠ వ్యవస్థాపకులు శ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి, మాతాజీ శ్రీ రమ్యానంద భారతీ ఈ సందర్భంగా అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య పూజలు చేసి 108 కూష్మాండాలతో (గుమ్మడికాయలు) నివేదన చేశారు. వేదపండితులు మంత్రాలతో హోమం జరిపించారు. ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

శ్రీసిటీ అభివృద్ధిని చూడండి

- రాష్ట్ర మంత్రుల సమావేశంలో శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి


పరిశ్రమల శాఖ మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి

శ్రీసిటీ (వరదయ్యపాళెం): ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక ప్రగతికి చిహ్నంగా మారిన శ్రీసిటీ పారిశ్రామికవాడ అభివృద్ధిని చూడాలని పలువురు ఆంధ్ర రాష్ట్ర మంత్రులను కలిసిన శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఆహ్వానించారు. ఈ మేరకు రెండు రోజుల పర్యటన నిమిత్తం రాజధానికి వెళ్లిన ఆయన ఆదివారం రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి టీజీ భరత్, పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మున్సిపల్ శాఖా మంత్రి డాక్టర్ పి.నారాయణ, దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలను గౌరవ పూర్వకంగా కలిశారు. మంత్రులతో జరిగిన చర్చల్లో శ్రీసిటీ ప్రస్తుత స్థితి, కొనసాగుతున్న, చేపట్టనున్న వివిధ పరిశ్రమల ప్రగతి, ప్రణాళికలను వారికి వివరించారు. శ్రీసిటీని సందర్శించి పురోగతిని ప్రత్యక్షంగా చూడాలని వారిని కోరినట్లు ఆయన వివరించారు.

కీళ్ల మార్పిడి రోగులతో క్రీడా సమ్మేళనం


గెలుపొందిన మహిళకు జ్ఞాపిక అందజేస్తున్న డాక్టర్ సునందకుమార్ రెడ్డి

తిరుపతి తుడా: తిరుపతిలోని ఆస్టర్ నారాయణాద్రి ఆసుపత్రిలో కీళ్ల మార్పిడి పేషెంట్స్‌కి క్రీడా సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఆస్టర్ నారాయణాద్రి ఆసుపత్రిలో మోకాళ్ల మార్పిడి రోగులకు క్రీడా పోటీలను నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ సునందకుమార్‌రెడ్డి మాట్లాడుతూ మోకాళ్లు మార్చుకుంటే ఆ తరువాత పనులు చేయకూడదన్న భ్రమలో చాలామంది ఉంటారన్నారు. ఆ అపోహలను తొలగించి ఆటలను సైతం ఆడవచ్చు అని చాటి చెప్పేందుకే ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. తమ ఆసుపత్రిలో అత్యంత పటిష్టంగా, సూక్ష్మంగా కీళ్ల మార్పిడి చేస్తున్నామని ఆయన తెలిపారు. ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ ముని, ఇతర వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టీటీడీలో బీసీల ఐక్యతే లక్ష్యం


బీసీ సంఘం నాయకులు, సభ్యులు

తిరుపతి(అలిపిరి): టీటీడీలో బీసీల ఐక్యతే లక్ష్యమని, ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ల ఎన్నికల్లో సమష్టిగా పనిచేసి సత్తా చాటాలని టీటీడీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం తిరుపతి వరదరాజునగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో బీసీ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో పోటీ చేసేందుకు గంగా రాజ్ కుమార్, రెడ్డిపల్లి కిషోర్, కె లోకనాథం, యువరాజ్‌ను ఎంపిక చేశారు. వీరిని రాబోయే కో–ఆపరేటివ్ టీటీడీ ఎన్నికల్లో గెలిపించుకోవాలని కోరారు. అనంతరం రుయా హాస్పిటల్ వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పావులూరు రవీంద్రబాబు, ప్రధాన కార్యదర్శి గంగా రాజ్ కుమార్ యాదవ్ , ట్రెజరర్ కామరాజు, గౌరవ అధ్యక్షులు మునిబాల కుమార్, ముని కుమార్, గౌరవ సలహాదారుడు శైలేంద్రకుమార్, అదనపు కార్యదర్శి గువ్వల దేశయ్య, వైస్ ప్రెసిడెంట్ కిషోర్, అనురాధ, వర్కింగ్ ప్రెసిడెంట్ యువ రాజ్ పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసం

– పంచాయతీ కార్యదర్శి అరెస్టు



పంచాయతీ కార్యదర్శి గిరిబాబును అరెస్టు చూపుతున్న వరదయ్యపాళెం పోలీసులు

వరదయ్యపాళెం: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని యువతిని మోసం చేసిన కేసులో పంచాయతీ కార్యదర్శి గిరిబాబును వరదయ్యపాళెం పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. సత్యవేడు సీఐ దివాకర్ రెడ్డి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. వరదయ్యపాళెం మండలంలోని సీఎల్ఎన్‌పల్లి పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం మిట్టహరిజనవాడకు చెందిన గిరిబాబు అయ్యావారిపాళెం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. చెన్నైకు చెందిన సింధు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఆమె మిట్టహరిజనవాడలోని తన అమ్మమ్మ ఇంటికి అప్పుడప్పుడు వచ్చి వెళ్లేది. అయితే వీరిద్దరికి ఏర్పడిన పరిచయం ప్రేమ వరకు దారి తీసింది. దీంతో ఇద్దరి మధ్య ఏర్పడిన ప్రేమ బంధం పెళ్లి వరకు వెళ్లింది. దీంతో ఈ ఏడాది జూన్ 26న పెద్దలు నిశ్చయించిన మేరకు సూళ్లూరుపేట ఆలయంలో వివాహం చేసుకునేందుకు నిర్ణయించి, పెళ్లిపత్రికలు సైతం పంచిపెట్టారు. అయితే వివాహాన్ని తప్పించుకోవడానికి పంచాయతీ కార్యదర్శి గిరిబాబు తన తల్లి సుబ్బమ్మ, అక్క లక్ష్మీ, బావ వెంకయ్యతో కలిసి పెళ్లి జరగాల్సిన జూన్ 26న పరారయ్యాడు. దీంతో యువతి సింధు తన కుటుంబ సభ్యులతో కలిసి అదే రోజున వరదయ్యపాళెం పోలీస్ స్టేషన్‌లో తనకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేశారు. ఆదివారం మండలంలో తిరుగుతున్న గిరిబాబును అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. గిరిబాబు తల్లి సుబ్బమ్మ, అక్క లక్ష్మీ, బావ వెంకయ్యపై కూడా కేసు నమోదు చేశామని, వారు పరారీలో ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

మలిమేలుకండ్రిగ వద్ద రోడ్డు ప్రమాదం

- 12 మందికి తీవ్ర గాయాలు
- క్షతగాత్రులను ఏరియా ఆసుపత్రికి తరలింపు


గాయపడిన తమిళనాడు వ్యక్తి


వాహనానికి ముందు భాగంలో చిక్కుకున్న క్షతగాత్రుడు

నాగలాపురం: మండలంలోని మలిమేలుకండ్రిగ సమీపంలో తిరుపతి చెన్నై జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తమిళనాడులోని తిరువళ్లూరు తాలూకా అమ్మయార్ కుప్పంకు చెందిన కొంతమంది మినీ బొలెరో వాహనంలో తమిళనాడులోని పెరియపాలయం అమ్మవారి ఆలయానికి వెళ్లి తిరుగు పయనమయ్యారు. మలిమేలుకండ్రిగ వద్ద రోడ్డు పక్కన ఆపి ఉన్న ఐషర్ వాహనాన్ని అదుపుతప్పిన బొలెరో వాహనం ఎదురుగా ఢీకొట్టింది. రెండు వాహనలూ నుజ్జునుజ్జయ్యాయి. ఈ ప్రమాదంలో బొలెరో వాహనంలో ప్రయాణిస్తున్న 12 మందికి తీవ్ర రక్త గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే నాగలాపురం, నింద్ర, పిచ్చాటూరు మండలాల నుండి 108 వాహనాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. క్షతగాత్రులను 108 వాహనంలో నగరి, పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. విషయం తెలుసుకున్న నాగలాపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేస్తున్నారు.